సాక్షి
అనకాపల్లి

శుక్రవారం । 2 । మే । 2025



మెట్ల నిర్మాణ ప్రణాళిక మార్పే..

సింహాచలం కొండపై నిర్మించిన కొత్త మెట్ల మార్గం రూపకల్పనలో మార్పులే దుర్ఘటనకు కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి. 8లో

ఉష్ణోగ్రతలు

గురువారం

		గరిష్టం/కనిష్టం
అనకాపల్లి	:	33.3/21.7
చోడవరం	:	37.0/27.0



కేంద్ర నిధులతో వృద్ధాశ్రమం

కశింకోట మండలం జి.భీమవరంలోని వృద్ధాశ్రమాన్ని న్యూఢిల్లీ నుంచి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వర్చువల్‌గా శుక్రవారం ప్రారంభించనున్నారు. 8లో

చేపా.. చేపా.. ఎక్కడికెళ్లావ్?





ఈ సీజన్‌లో చేప పిల్లల ఉత్పత్తి లేనట్టే!

హార్మోన్ల అభివృద్ధికి చేపలకు ఇంజక్షన్లు చేసేవారు..కృత్రిమ పద్ధతిలో వివిధ రకాలైన కోటీ 25 లక్షల చేప పిల్లల్ని ఉత్పత్తి చేసేవారు..జిల్లాలోని అన్ని రిజర్వాయర్లకు సరఫరా చేయడమే కాక ప్రైవేట్ వ్యక్తులకు సైతం విక్రయించే వారు..మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఆరోగ్యకరమైన చేపల ఉత్పత్తి జరిగేది..కానీ ఇప్పుడు అదంతా గతం. కిందటి ఏడాది నుంచి ఈ ప్రక్రియ ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం దీనిపై శ్రద్ధ చూపకపోవడం, నిధులు కేటాయించకపోవడంతో తాండవ రిజర్వాయరు వద్ద ఉన్న చేప పిల్లల ఉత్పత్తి కేంద్రానికి తాళం వేశారు.



శిథిలావస్థలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం భవనాలు

గతంలో ఏటా కోటి 25 లక్షలకు పైగా పిల్లల ఉత్పత్తి

ఉత్పత్తి కేంద్రం నిర్వహణ లేక శిథిలావస్థలో భవనాలు

నాతవరం: తాండవలో గల చేప పిల్లల ఉత్పత్తి కేంద్రానికి ఒకప్పుడు ఉత్తరాంధ్రలోనే ప్రత్యేక స్థానం ఉండేది. రిజర్వాయరు దిగువ ప్రాంతంలో 1984లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ప్రతి ఏటా జూన్–ఆగస్టు మధ్య కాలంలో కోటి 25 లక్షలు చేప పిల్లలను ఉత్పత్తి చేసేవారు. పెద్ద చేపల్లో హార్మోన్ల అభివృద్ధికి ఇంజక్షన్లు చేయడంతో వివిధ రకాలు చేప పిల్లల ఉత్పత్తి జరిగేది. ఆ పిల్లలను ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా మత్స్య సహకార సంఘాలకు సరఫరా చేసేవారు. మిగిలిన పిల్లలను జిల్లాలో ఉన్న రైవాడ, కల్యాణపులోవ, కోనాం, వరాహ, మేహాద్రి గెడ్డ, రావణాపల్లి రిజర్వాయర్లలో విడుదల చేసేవారు. చెరువుల్లో పెంచుకునేందుకు ప్రైవేటు వ్యక్తులకు కూడా విక్రయించేవారు. అంతటి ప్రాముఖ్యం కలిగిన తాండవ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో గతేడాది నుంచి మచ్చుకైనా చేప పిల్లల్ని ఉత్పత్తి చేయడం లేదు. నిత్యం మత్స్య సహకార సంఘాల సభ్యులు, అధికారులతో కళకళలాడే ఉత్పత్తి కేంద్రంలో సిబ్బంది జాడే లేదు. ఎప్పుడు చూసినా చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం మూసే ఉంటుంది. నీటి కోసం కేంద్రంలో ఏర్పాటు చేసిన బోరును ఉపయోగించకపోవడంతో పాడైంది. అడవిని తలపించేలా పెరిగిన పిచ్చి మొక్కలు బోరును కప్పేశాయి. గతంలో ఇక్కడ పని చేసిన కొంతమంది సిబ్బంది ఉద్యోగ విరమణ చేయగా మరికొందరు ఇతర ప్రదేశాలకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఈ కేంద్రం నర్సీపట్నం మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో నడుస్తోంది. ఈ విషయంపై నర్సీపట్నం మత్స్యకార అభివృద్ధి అధికారి నాగమణిని వివరణ కోరగా చేప పిల్లలను ఉత్పత్తి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదన్నారు. గతంలో ఉండే సిబ్బంది ప్రస్తుతం లేరన్నారు. ఇతర ప్రాంతాల నుంచి తెచ్చిన చేప పిల్లలను గత ఏడాది తాండవ రిజర్వాయరులో విడుదల చేశామన్నారు.



తాండవలో చేప పిల్లలు పెంచేందుకు ఏర్పాటు చేసిన నీటి కుండీలు



మూసి ఉన్న తాండవలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఆఫీసు గది

నష్టాలివీ..

- చేప పిల్లల ఉత్పత్తి నిలిచిపోవడం వల్ల తాండవ రిజర్వాయర్‌లో చేపల వేట తగ్గిపోయింది. దీంతో వేటపై ఆధారపడి జీవించే జాలరిపేటకు చెందిన మత్స్యకారులు ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారు.
- చేప పిల్లల ఉత్పత్తి లేకపోవడంతో సరకు తగ్గి ధర బాగా పెరిగింది. తాండవ బొచ్చు చేపకు భలే గిరాకీ ఉండేది. ఇక్కడ పెంచిన చేపలు ఎంతో రుచిగా ఉంటాయని పేరు. వినియోగదారులకు వివిధ రకాల నాణ్యమైన చేపలు అందకుండా పోయాయి.
- మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిపుణుల ఆధ్వర్యంలో చేపలను మనమే పెంచడం వల్ల ఆరోగ్యకరంగా ఉండేవి. విరివిగా లభించేవి. ఇప్పుడు ఆ అవకాశం లేదు.

కూటమి నిర్లక్ష్యానికి నిదర్శనం



నేను సరుగుడు సర్పంచ్‌గా ఉన్నప్పుడు చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం వైభవాన్ని దగ్గరుండి చూశాను. జిల్లా స్థాయి అధికారులు చేప పిల్లల ఉత్పత్తిని చూసేందుకు వస్తుండేవారు. మళ్లీ ఆ రోజులు రావాలంటే ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. సిబ్బందిని నియమించాలి. ఈ సమస్యను వచ్చే మండల సర్వసభ్య సమావేశంలో చర్చిస్తాం.

– సాగిన లక్ష్మణమూర్తి, నాతవరం ఎంపీపీ

స్పీకర్ దృష్టి సారించాలి



తాండవలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం శిథిలావస్థలో ఉంది. కేంద్రంలో పిల్లల ఉత్పత్తి నిలిచిపోయింది. దీనిపై స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు దృష్టి సారించాలి. రాజకీయాలకు అతీతంగా కేంద్రం పూర్వ వైభవం కోసం పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. అవసరమైతే కలెక్టరుకు ఫిర్యాదు చేస్తాను.

–బాలేపల్లి వెంకటరమణ, సీపీఐ జిల్లా కార్యదర్శి

న్యూస్‌రీల్

డిజిటల్ క్లాక్ డిజైన్‌కు రూ.5 లక్షల నజరానా

తాటిచెట్లపాలెం (విశాఖ): రైల్వే స్టేషన్లలో సమయాన్ని చూపించే డిజిటల్ గడియారం డిజైన్ చేసేందుకు ఆసక్తి గల వారి నుంచి డిజైన్లను భారతీయ రైల్వే ఆహ్వానిస్తోంది. ఎంపిక చేసిన డిజైన్‌కు రూ. 5 లక్షల బహుమతి కూడా ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు వాల్తేర్ డివిజన్ అధికారులు ఒక ప్రకటన ద్వారా వివరాలు తెలిపారు. భారతీయ రైల్వే, దేశంలోని అన్ని రైల్వే స్టేషన్లలో ప్రదర్శించడానికి జాతీయ స్థాయిలో డిజిటల్ గడియారం డిజైన్ పోటీని నిర్వహిస్తోంది. ఈ పోటీని మూడు విభాగాలుగా విభజించారు. నిపుణులు, కళాశాల/విశ్వవిద్యాలయ విద్యార్థులు, పాఠశాల విద్యార్థులు. ఈ మూడు విభాగాల నుంచి ఎంపిక చేసిన ఉత్తమ డిజైన్‌కు మొదటి బహుమతిగా రూ. 5 లక్షలు అందజేస్తారు. అలాగే ప్రతి విభాగం నుంచి ఐదుగురికి ఒక్కొక్కరికి రూ. 50 వేల చొప్పున ప్రోత్సాహక బహుమతులు కూడా ఇవ్వనున్నారు. ఆసక్తి గలవారు తమ డిజైన్‌లను మే 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో సమర్పించాలని రైల్వే అధికారులు తెలిపారు. ఎంట్రీలు అధిక రిజల్యూషన్‌లో ఉండాలి, వాటిపై వాటర్ మార్క్‌లు, లోగోలు వంటివి ఏమీ ఉండకూడదు. అభ్యర్థులు తమ ధ్రువీకరణ పత్రాన్ని కూడా జతచేయాలని రైల్వే బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇన్ఫర్మేషన్ అండ్ పబ్లిసిటీ) దిలీప్‌కుమార్ తెలిపారు. పాల్గొనేవారు ఎన్ని డిజైన్‌లనైనా పంపవచ్చు, అయితే ప్రతి డిజైన్‌కు సంబంధించిన వివరణ, దాని ఉద్దేశ్యం స్పష్టంగా ఉండాలని సూచించారు. పాఠశాల విభాగంలో ప్లస్ 2 వరకు చదివే విద్యార్థులు అర్హులు, వారు తమ పాఠశాల గుర్తింపు కార్డును కూడా అప్‌లోడ్ చేయాలి. కళాశాల, విశ్వవిద్యాలయ విద్యార్థులు కూడా వారి ప్రస్తుత విద్యార్థి స్థితిని తెలిపే పత్రాలను అప్‌లోడ్ చేయాలని తెలిపారు.

ఏషియన్ రోలర్ స్కేటింగ్ పోటీలకు చైత్రదీపిక



చైత్రదీపిక

నర్సీపట్నం: ఏషియన్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు నర్సీపట్నానికి చెందిన క్రీడాకారిణి పెదిరెడ్ల చైత్రదీపిక ఎంపికైంది. గత నెల 16 నుంచి 30వ తేదీ వరకు మొహలీ, పంజాబ్‌లో జరిగిన భారత ఆర్టిస్టిక్ రోలరు స్కేటింగ్ జట్టు ఎంపిక పోటీలో చైత్రదీపిక యూత్ కేటగిరి పెయిర్ స్కేటింగ్‌లో మెరుగైన ప్రతిభ చాటి భారత జట్టులో స్థానం సాధించింది. దక్షిణ కొరియాలో జూలై 20 నుంచి 30వ తేదీ వరకు జరిగే 20వ ఏషియన్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనుంది. చైత్రదీపిక తన ప్రతిభను వరుసగా మూడవసారి అంతర్జాతీయస్థాయిలో చాటేందుకు అవకాశం వచ్చింది. అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి, రాష్ట్రానికి, జిల్లాకు పేరు తీసుకురానుంది.

ప్యాకెట్ల రూపంలో అప్పన్న చందనం విక్రయాలు

సింహాచలం: చందనోత్సవంరోజు శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిజరూప దర్శనాన్ని పురస్కరించుకుని స్వామిపై ఒలిచిన విసర్జన చందనం 97 కిలోలు వచ్చినట్టు దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్ తెలిపారు. త్వరలోనే భక్తులకు చందనాన్ని ప్యాకెట్లు రూపంలో విక్రయాలు జరుపుతామని పేర్కొన్నారు.

కారు ఢీకొని జింకకు గాయాలు




జింకను సంరక్షిస్తున్న యువకుడు

కొమ్మాది (విశాఖ): బీచ్‌రోడ్డులో ఇందిరాగాంధీ జూపార్కు సమీపంలో నగరం నుంచి భీమిలి వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు దాటుతున్న జింకను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జింక ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ఓ యువకుడు గమనించి, గాయపడిన జింకను రోడ్డు పక్కకు చేర్చి నీరు తాగించాడు. అనంతరం దానిని సురక్షిత ప్రాంతంలో విడిచిపెట్టాడు. అయితే, ఇటీవల కాలంలో జింకలు తరచూ జనావాసాల్లోకి రావడం, ప్రమాదాలకు గురికావడంపై జంతు ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ప్రమాదాల బారిన పడి మరికొన్ని జింకలు మృత్యువాత పడుతున్నా అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈసారీ కందిపప్పు లేనట్టే!

సామాన్య, మధ్య తరగతి ప్రజలకు పప్పన్నం దూరం



అనకాపల్లి టౌన్: జిల్లాలో రేషన్ కార్డుదారులకు ఈ నెలలో కూడా బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేయనున్నారు. కందిపప్పును మాత్రం అడగొద్దని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. కొద్ది నెలలుగా కందిపప్పు పంపిణీ చేస్తారని ఆశతో ఎదురుచూసినా కార్డుదారులకు ఈ నెల కూడా నిరాశే ఎదురైంది. జిల్లా వ్యాప్తంగా 5.37 లక్షల రేషన్ కార్డుదారులకు 14.99 లక్షల మంది యూనిట్ దారులు ఉన్నారు. వీరందరూ కందిపప్పు కోసం బహిరంగ మార్కెట్‌ను ఆశ్రయించాల్సిందే. కూటమి ప్రభుత్వం రాగానే ఉచిత బియ్యంతో పాటు జొన్నలు, రాగులు, పంచదార వంటి నిత్యావసర వస్తువులన్నీ ఇస్తామని ఊదరగొట్టింది. దీంతో లబ్ధిదారులందరూ ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి **వచ్చిన కూటమి ప్రభుత్వం బియ్యం, పంచదార** మాత్రమే పంపిణీ చేస్తుండడంతో కార్డుదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ డిపోల ద్వారా కేజీ కందిపప్పును 67 రూపాయలకు అందజేసేవారు. కానీ చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే రేషన్‌పై ఊదరగొట్టారు. ప్రయోగాత్మకంగా పట్టణ ప్రాంతాలలో కేజీ 50 రూపాయలకే కందిపప్పు అందజేస్తామని ప్రకటించారు. బహిరంగ మార్కెట్‌లో కేజీ కందిపప్పు రూ.120 పలుకుతుంది. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా రేషన్ ద్వారా కార్డుదారులకు కందిపప్పును పంపిణీ చేయకపోవడం వల్ల 14.99 లక్షల మందికి 120 రూపాయలు చొప్పున లెక్కిస్తే 17,98,80,000 **చేతి చమురు వదులుతుందన్నమాట.**



అనకాపల్లిలో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ

నవతరానికి మేల్కొలుపు

జిల్లాలో మేడే వేడుకలు కార్మికులంతా ఘనంగా నిర్వహించుకున్నారు. వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు జరిపారు. పతాకావిష్కరణలు జరిపారు. మే డే విశిష్టతను, కార్మిక పోరాటాలను గుర్తు చేసుకున్నారు. కార్మిక హక్కులను కాపాడుకోవాలని ఆకాంక్షించారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని, కార్మికులకు సరైన భద్రతా ప్రమాణాలు, శ్రమకు తగ్గ వేతనాలు అందించాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, కుల,మత, ప్రాంతీయ ఉన్మాదాలను విడనాడాలని నినదించారు.

కూటమి నేతల కక్కుర్తే కొంపముంచింది

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పుణ్యక్షేత్రాల్లో ఎన్నడూలేని ఘోరాలు, విషాదాలు సంభవిస్తున్నాయి. భక్తుల సౌకర్యాల కంటే.. ఉత్సవ సమయంలో ఎంత ఎక్కువగా సొమ్ము చేసుకోవచ్చనే దానిపై కూటమి నేతల ఆత్రమే వీటికి కారణమన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హోం మంత్రి దగ్గర నుంచి.. భీమిలి ఎమ్మెల్యే వరకూ ప్రతి ఒక్కరూ తమ అనుచరులకు కాంట్రాక్టులు, అనుయాయులకు వీఐపీ టికెట్లు ఇప్పించుకోవడంలోనే నిమగ్నమయ్యారు. ఎంత మంది భక్తులు వస్తారు, ఎలాంటి ఏర్పాట్లు చేయాలన్న దానిపై దృష్టిసారించలేదు. కూటమి నేతల కాసుల కక్కుర్తి ఈ దుర్ఘటనతో మరోసారి స్పష్టమైంది.



సాక్షి, విశాఖపట్నం: ఊహకందని విషాదం యావత్ రాష్ట్రాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఏడుగురి ప్రాణాల్ని బలిగొన్న దుర్ఘటనలో కూటమి ప్రభుత్వం అంతులేని నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. దీన్ని కప్పిపుచ్చుకునేందుకు.. భారీ వర్షం కారణంగానే ప్రమాదం జరిగిందంటూ ముఖ్యమంత్రి నుంచి కింది స్థాయి నాయకుల వరకూ వంత పాడుతున్నారు. కానీ.. కూటమి నేతల కక్కుర్తి కారణంగానే విషాదం నెలకొందని తెలుస్తోంది. కేవలం తమకు చందనోత్సవం వల్ల ఏం లాభం ఒనగూరుతుందనే దానిపైనే ఎక్కువ దృష్టి సారించారు తప్ప... సామాన్య భక్తులకు అప్పన్న దర్శనం సజావుగా జరిగేలా చూసేందుకు ఎలాంటి ఏర్పాట్లు చెయ్యాలి.. ఎక్కడా ఇబ్బందులు లేకుండా చందనోత్సవాన్ని ఎలా నిర్వహించాలనేదానికి ప్రాధాన్యమివ్వలేదు. ఏర్పాట్లు చేసేందుకు వివిధ రకాల పనుల్ని కాంట్రాక్టు సంస్థలకు అప్పగించారు. ఈ పనులన్నింటినీ భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, హోంమంత్రి అనిత స్వయంగా పర్యవేక్షిస్తూ... తమకు నచ్చిన వారికే కాంట్రాక్టులు అప్పగించారు.

వాటర్ బాటిళ్ల మాయాజాలం!

ప్రతి చందనోత్సవానికి జీవీఎంసీ నీటిని పూర్తిస్థాయిలో సరఫరా చేస్తుంది. దీనికి తోడుగా.. సింహాచలం దేవస్థానానికి మంచినీటి బాటిళ్లని అందించే రెగ్యులర్ కాంట్రాక్టర్ కూడా ఉన్నారు. ప్రతి ఉత్సవానికి వీఐపీలకు 500 మిలీ బాటిల్స్ సరఫరా చేస్తుంటారు. ఈ చందనోత్సవానికి కూడా సదరు కాంట్రాక్టర్ 500 మిలీ బాటిల్స్‌ని లక్ష సరఫరా చేసే టెండరు అప్పగించారు. జీవీఎంసీ 20 లీటర్ల క్యాన్లు, పేపర్ గ్లాసుల్ని భారీ స్థాయిలో భక్తుల కోసం క్యూలైన్లలో, బస్ పాయింట్స్ దగ్గర, తొలి పావంచా దగ్గర ఏర్పాటు చేసింది. అయినా.. నీటి బాటిళ్లలో హోంమంత్రి మాయాజాలం ప్రదర్శించారు. అవసరం లేకపోయినా.. 250 మిలీ నీటి బాటిల్స్ కచ్చితంగా ఉండాలంటూ హుకుం జారీ చేశారు. భక్తులు లక్షన్నర వరకూ వస్తారని అంచనా వేశారు. అయినా.. 3 లక్షల బాటిల్స్ అవసరమంటూ హోంమంత్రి చెప్పడంతో దీనికి టెండర్లు పిలిచారు. ఈ టెండర్‌ని హోంమంత్రి ముఖ్య అనుచరుడికి అప్పగించారు. వాస్తవానికి ఈ బాటిల్స్‌ని 3 లక్షల వరకూ సరఫరా చేస్తామని చెప్పి టెండరు దక్కించుకున్న హోం మంత్రి అనుచరుడు.. కేవలం లక్షన్నర బాటిల్స్ మాత్రమే ఇచ్చి.. లెక్క మాత్రం 3 లక్షలుగా చూపించినట్లు తెలుస్తోంది.

ఏర్పాట్లన్నీ గంటా అనుచరులకే..

అదే విధంగా.. ఏర్పాట్ల టెండర్ల వ్యవహారమంతా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నడిపించినట్లు సమాచారం. టెంట్లు, లైటింగ్, ఇతర పనులకు సంబంధించిన మొత్తం టెండర్లన్నీ గంటా దగ్గరుండి మరీ అనుచరులకు అప్పగించినట్లు తెలుస్తోంది. ఇలా కాంట్రాక్టుల ద్వారా అనుచరులకు లబ్ధి కలిగించేందుకు ప్రయత్నించారే తప్ప.. భక్తుల గురించి కనీసం పట్టించుకోలేదు. పోనీ ఆ పనులైనా సక్రమంగా చేపట్టారా అంటే.. దానికి కూడా అతీగతీ లేకుండా పోయింది. ఘటన జరిగిన తర్వాత.. బస్సులు కొండపైన నిలిపేయడంతో భక్తులు దిగువనే ఉండిపోయారు. అక్కడ కనీస సౌకర్యాలు అందక నరక యాతన అనుభవించారు. ఇలా.. సింహాచలంలో జరిగిన దారుణానికి ప్రధాన కారణం కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యమే అయినా.. వరుణుడిపై నెట్టేసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

5న వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం



పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో చర్చిస్తున్న అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్: అనకాపల్లి రింగ్‌రోడ్ పెంటకోట కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల ఐదున ఉదయం 10 గంటలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరుగుతుందని అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. ఈ మేరకు గురువారం సమావేశం జరిగే హాల్‌ను పార్టీ క్యాడర్‌తో కలిసి పరిశీలించి ఏర్పాట్లపై చర్చించారు. ముందుగా రింగ్‌రోడ్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశంలో ముఖ్యంగా జరిగిన సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఏమాత్రం లబ్ధి చేకూరలేదన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి, ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా నెరవేర్చకపోవడం చంద్రబాబు మార్క్ రాజకీయానికి నిదర్శనమన్నారు. అలాగే రాబోయే కాలంలో ప్రభుత్వ వైఫల్యాలను ఏ విధంగా ఎండగట్టాలి, అందుకు కార్యకర్తలను సమాయత్తం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. జిల్లాలో ఉన్న అన్ని గ్రామాల నుంచి పార్టీ ముఖ్య కార్యకర్తలు, బూత్ కమిటీ ఏజెంట్లు, నియోజకవర్గాల ఇన్చార్జిలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. రెండు వేల మందితో నిర్వహించే ఈ సభకు ముఖ్య అతిథులుగా ఏపీ శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్సార్‌సీపీ రీజనల్ కో– ఆర్డినేటర్ కురసాల కన్నబాబు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ మలసాల భరత్ కుమార్, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, అల్లూరి జిల్లా పరిశీలకులు బొడ్డేడ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద్, పార్టీ సీనియర్ నాయకులు మళ్ల బుల్లిబాబు, కె.ఎం. నాయుడు, బొడ్డేడ శివ, గండిరవి, ఉగ్గిన అప్పారావు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ముగిసిన సహస్ర ఘటాభిషేకం

తెల్లవారుజామున 3 గంటలకు అప్పన్నకు తొలివిడత చందనం సమర్పణ

సింహాచలం: చందనోత్సవం సందర్భంగా నిర్వహించిన సహస్ర ఘటాభిషేకం గురువారం తెల్లవారుజామున 1 గంటకు ముగిసింది. అనంతరం, తెల్లవారుజామున 3 గంటలకు స్వామివారికి మొదటి విడతగా మూడు మణుగుల చందనాన్ని శాస్త్రోక్తంగా సమర్పించారు. గురువారం స్వామివారు గుమ్మడిపండు ఆకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



ప్రధాన కలశాన్ని శిరస్సుపై పెట్టుకుని అభిషేకం నిర్వహణకు వస్తున్న ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు

మెట్ల నిర్మాణ ప్రణాళిక మార్పే ప్రాణాలను బలిగొందా...



మెట్లమార్గం ఎడమవైపు డైవర్షన్ ప్రాంగణంలో చోటుచేసుకున్న ప్రమాదం



నూతన షాపింగ్ కాంప్లెక్స్ వద్ద నూతనంగా నిర్మించిన మెట్లమార్గం

- పాత పద్ధతిలోనే మెట్లమార్గం నిర్మిస్తే ప్రమాదం జరిగేది కాదు
- అడుగడుగునా అధికారుల నిర్లక్ష్యం

సింహాచలం: సింహాచలం కొండపై షాపింగ్ కాంప్లెక్స్ వద్ద నుంచి జోడు భద్రాల ప్రాంగణానికి వెళ్లేందుకు నిర్మించిన కొత్త మెట్లమార్గం రూపకల్పనలో చేసిన మార్పులే ఏడుగురు భక్తుల ప్రాణాలను బలిగొన్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో అనేక చందనోత్సవాల సమయంలో అదే స్థలంలో ఉన్న పాత మెట్లమార్గంలో తీవ్రమైన తోపులాటలు, అధిక రద్దీ నెలకొన్నప్పటికీ ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే, దురదృష్టవశాత్తు చరిత్రలో మొదటిసారిగా అదే ప్రదేశంలో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం విషాదకరం. వివరాల్లోకి వెళితే, సింహగిరిపై ఉన్న బస్టాండ్ నుంచి ఆలయానికి చేరుకోవడానికి ఉన్న మెట్లమార్గం ఇరువైపులా రెండు బ్లాక్‌లలో వ్యాపారుల షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. గతంలో ఈ మెట్లమార్గం నేరుగా జోడు భద్రాల ప్రాంగణానికి చేరుకునేది. చందనోత్సవం రోజుల్లో భక్తులను ఈ మార్గంలోనే



మెట్లమార్గం కుడివైపు డైవర్షన్ చేస్తూ నిర్మించిన మెట్లు

వరుస క్రమంలో పంపి నేరుగా జోడు భద్రాల ప్రాంగణానికి వెళ్లేలా ఏర్పాట్లు చేసేవారు. ప్రసాద్ స్కీమ్ కింద పాత షాపింగ్ కాంప్లెక్స్‌ను తొలగించి, కొత్త దుకాణాలను రెండు బ్లాక్‌లుగా పాత పద్ధతిలోనే నిర్మించారు. అయితే, ఈ రెండు బ్లాక్‌ల మధ్య నిర్మించిన కొత్త మెట్లమార్గం విషయంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం వహించారు. పాత ప్రణాళికలను అనుసరించకుండా, జోడు భద్రాల వద్దకు చేరుకునే మెట్లను కుడి, ఎడమ వైపులకు మళ్లించారు. మధ్యలో దాదాపు తొమ్మిది అడుగుల ఎత్తులో నాసిరకమైన గోడను నిర్మించడంతో, ఎడమ వైపు నుంచి రూ.300 క్యూలో వెళ్తున్న భక్తులపై అది ఒక్కసారిగా కూలిపోయింది. ఈ దుర్ఘటనలో అక్కడికక్కడే ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు.

వైదిక వర్గాలు చెబుతున్నా లెక్కచేయకుండా...

ఏటా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి కొండ దిగువన నాలుగు పర్యాయాలు ఉత్సవాలు జరుగుతాయి. ఆ సందర్భాలలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను కొండపై నుంచి పల్లకిలో దిగువకు తీసుకువస్తారు. గతంలో జోడు భద్రాల నుంచి నేరుగా ఉన్న మెట్లమార్గం ద్వారానే ఊరేగింపు జరిగేది. కొత్త షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం తర్వాత కూడా అదే విధంగా నిర్మించాలని పలువురు వైదిక పండితులు సూచించినప్పటికీ, అధికారులు వారి మాటలను పట్టించుకోలేదని తెలుస్తోంది. వారి నిర్లక్ష్య వైఖరి ఇప్పుడు ఏడుగురు భక్తుల ప్రాణాలను బలిగొన్న విషాదానికి దారితీసింది.

విషాదంతో ఉలిక్కిపడ్డ వ్యాపారులు

కొత్తగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లోకి ప్రవేశించి నాలుగు రోజులు కూడా గడవకముందే, తమ ప్రాంగణంలో ఇంతటి ఘోర విషాదం చోటుచేసుకోవడంతో సింహగిరి వ్యాపారులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. పాదాలమ్మ-బంగారమ్మ ఆలయాల ప్రాంగణంలో తాత్కాలిక దుకాణాల్లో వ్యాపారం చేసుకుంటున్న వర్తకులను, చందనోత్సవానికి కేవలం నాలుగు రోజుల ముందు హడావుడిగా, ఇంకా పూర్తిగా సిద్ధం కాని కొత్త షాపింగ్ కాంప్లెక్స్‌లోకి తరలించారు. చందనోత్సవ సమయంలో వాహనాల పార్కింగ్ కోసం స్థలం అవసరమని చెప్పడంతో వ్యాపారులు అయిష్టంగానే కొత్త షాపింగ్ కాంప్లెక్స్‌లోకి మారారు. తరలి వెళ్లిన కొద్ది రోజులకే తమ షాపింగ్ కాంప్లెక్స్ వద్దే ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారని తెలిసి ఆందోళన చెందారు. సింహగిరి చరిత్రలో ఎన్నడూ ఇలాంటి దుర్ఘటన జరగలేదని, అయ్యో పాపం భక్తులంటూ వారు కన్నీటి పర్యంతమయ్యారు.

కొత్తపెంట కొత్తూరు పైడిమాంబ ఆలయంలో భారీ చోరీ

- ముప్పావు తులం బంగారం, మూడున్నర కేజీల వెండి అభరణాలు చోరీ
- చోరీ సొత్తు విలువ రూ. 4 లక్షలు పైమాటే. సంఘటన స్థలాన్ని సందర్శించిన సీఐ పైడపునాయుడు
- క్లూస్ టీమ్ ఆధారాల సేకరణ



ఆలయంలో క్లూస్ టీమ్‌తో కలిసి ఆధారాలు సేకరిస్తున్న కె.కోటపాడ సీఐ పైడపునాయుడు



ఆలయం తలుపు గడిని విరగ్గొట్టిన దొంగలు

దేవరాపల్లి: మండలంలోని కొత్తపెంట శివారు కొత్తూరులోని పైడిమాంబ అమ్మవారి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. దొంగతనానికి సంబంధించి స్థానిక సర్పంచ్ వెంకటరావు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి మెడలో ముప్పావు తులం బంగారు మంగళ సూత్రాలు, మూడున్నర కేజీల వెండితో తయారీ చేసిన కిరీటం తదితర ఆభరణాలు అమ్మవారికి అలంకరణ చేశామన్నారు. బుధవారం రాత్రి దొంగలు ఆలయ తలుపు గడియ ధ్వంసం చేసి ఆలయంలోకి చొరబడి అమ్మవారికి అలంకరించిన అభరణాలన్నింటిని దోచుకుపోయారన్నారు. వాటి విలువ సుమారు రూ. 4 లక్షలకు పైబడి ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు అంచనా వేస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు ఈ దొంగతనానికి పాల్పడి ఉంటారని స్థానిక సర్పంచ్ రొంగలి వెంకటరావు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పేర్కొన్నారు. గురువారం ఉదయం ఆలయం తలుపులు తెరిచి ఉండటాన్ని స్థానికులు గమనించడంతో ఈ దొంగతనం విషయం వెలుగులోకి వచ్చిందని వారు తెలిపారు. చోరీ జరిగినట్టు పోలీసులకు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు కె.కోటపాడు సీఐ పైడపునాయుడు చోరీ జరిగిన ఆలయాన్ని పరిశీలించారు. అనకాపల్లికి చెందిన క్లూస్ టీమ్‌ను రప్పించి దొంగతనం జరిగిన ప్రాంతంలో ఆధారాలతో పాటు వేలిముద్రలను సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

మొదటి రోజే పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలి

తుమ్మపాల: ఎన్టీఆర్ భరోసా పింఛన్లు సక్రమంగా, సకాలంలో పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని కోడూరు పంచాయతీ ఎస్సీ కాలనీలో గురువారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ఆమె లబ్ధిదారులకు పింఛన్ల నగదు అందించారు. ప్రతి నెలా పింఛను సక్రమంగా అందుతుందా, ప్రభుత్వం అందిస్తున్న పింఛను డబ్బులు పూర్తిగా అందుతున్నాయా, పింఛను అందజేస్తున్నప్పుడు ఎవరైనా డబ్బులు అడుగుతున్నారా? అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెన్షన్లు అందుకున్నప్పుడు డబ్బులు సరి చూసుకోవాలన్నారు. ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా పింఛను పంపిణీ వేగంగా జరగాలన్నారు. లబ్ధిదారులు పింఛన్లు పంపిణీ



పింఛను అందించి వృద్ధురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రక్రియపై సంతృప్తి వ్యక్తం చేశారు. మొదటి రోజే శత శాతం పంపిణీ పూర్తి జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె.శచీదేవి, ఎంపీడీవో నర్సింగరావు, గ్రామ సర్పంచ్ సేనాపతి లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

దాడికి పాల్పడ్డవారిపై చర్య కోరుతూ ఏఎస్పీకి ఫిర్యాదు

అనకాపల్లి: నక్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో తమ కుటుంబానికి న్యాయం జరగలేదని నక్కపల్లి మండలం ఉద్దండపురం గ్రామానికి చెందిన ఆవాల సురేష్, ఆవాల నాగేశ్వరరావు, చిట్టెమ్మతో పాటు మరో 30 మంది కుటుంబ సభ్యులు గురువారం ఎస్పీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ 4వ తేదీన నక్కపల్లి మండలం ఉద్దండపురం గ్రామానికి చెందిన వెలమశెట్టి శ్రీను, సోమరాజు జయంత్‌తో పాటు మరో ముగ్గురు వ్యక్తులు అదే గ్రామానికి చెందిన ఆవాల సురేష్, లక్ష్మిలను తీవ్రంగా దాడి చేసి గాయపరిచారని, సురేష్‌ను నక్కపల్లి, లక్ష్మి (61)ని తుని ఆస్పత్రిల్లో చేర్పించడం జరిగిందన్నారు. దీనిపై 5తేదీన నక్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆవాల సురేష్ ఫిర్యాదు చేసినప్పటికీ క్షతగాత్రులకు న్యాయం జరగలేదని కుటుంబ సభ్యులు ఆవేదన



ఎస్పీ కార్యాలయం వద్ద ఉద్దండపురానికి చెందిన ఆవాల సురేష్, నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు

వ్యక్తం చేశారు. లక్ష్మి చికిత్స పొందుతూ ఏప్రిల్ 8న మృతి చెందిందని, అప్పటి నుంచి క్షతగాత్రుల కుటుంబానికి నక్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో న్యాయం జరగలేదని, తక్షణమే న్యాయం చేయాలని కోరుతూ ఎస్పీ కార్యాలయానికి వచ్చినట్టు ఆవాల సురేష్, నాగేశ్వరరావు చెప్పారు. అడిషనల్ ఎస్పీకి వినతిపత్రం అందజేశారు.

జి.భీమవరంలో కేంద్ర నిధులతో వృద్ధాశ్రమం

న్యూఢిల్లీ నుంచి నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న రాష్ట్రపతి ముర్ము

కశింకోట: మండలంలో జి.భీమవరంలో ఉన్న వృద్ధాశ్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వర్చువల్‌గా శుక్రవారం ఉదయం 11 గంటలకు న్యూఢిల్లీ నుంచి ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఇక్కడ అవసరమైన ఏర్పాట్లు చేశారు. పావని సొసైటీ ఫర్ ది మల్టీపుల్ హ్యాండీ క్యాప్డ్ అండ్ స్పాస్టిక్స్ సంస్థ ఆధ్వర్యంలో గత రెండేళ్లుగా ఈ ఆశ్రమం కొనసాగుతోంది. ఇక నుంచి ఈ ఆశ్రమం కేంద్రం నిధులతో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ నిర్వహించనుంది. ఈ ఆశ్రమంతో పాటు తమిళనాడులో వేలూరు, నాగాలాండ్, మరో రెండు రాష్ట్రాల్లో ఏర్పాటు చేసిన వృద్ధాశ్రమాలను రాష్ట్రపతి ప్రారంభించనున్నారు. ఇందుకు సన్నాహాలు చేశామని, ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య ఈ కార్యక్రమం ఉంటుందని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు బి.ఆశయ్య గురువారం విలేకరులకు తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సంచాలకుడు ఎ.రవి ప్రకాష్‌రెడ్డి, కలెక్టర్ విజయ కృష్ణన్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్ల దినోత్సవాన్ని నిర్వహించి, 'ఏజింగ్ విత్ డిగ్నిటీ'అనే ప్రత్యేక కార్యక్రమం న్యూఢిల్లీలో రాష్ట్రపతి సమక్షంలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయడానికి ఎల్ఈడీ స్క్రీన్‌ను ఇక్కడ ఏర్పాటు చేశారు. వర్చువల్‌గా రాష్ట్రపతితో మమేకం కావడానికి ఇక్కడ వయోవృద్ధులు రిహార్సల్స్ చేశారు. వృద్ధాశ్రమంలో 25 మంది నివాసం ఉండి సేవలు పొందడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఆశ్రమం కార్యదర్శి ఎం.సత్యవాణి 'సాక్షి'కి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అనాథలు, పాక్షిక అనాథలు, ఆర్థికంగా వెనుకబడిన వారు, కుటుంబ సభ్యుల ఆదరాభిమానాలకు దూరమైన వారిని ఆశ్రమంలో చేర్చుకున్నామన్నారు.



ఆశ్రమంలో ప్రారంభోత్సవ కార్యక్రమం వీక్షించడానికి ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్



ప్రారంభ కార్యక్రమానికి పాటలు పాడుతూ రిహార్సల్స్ చేస్తున్న వృద్ధాశ్రమంలో వృద్ధులు

పిడుగుపాటుకు మూడు ఆవుల మృతి

మునగపాక: పిడుగుపాటుకు మండలంలోని మడకపాలెంలో మూడు ఆవులు మృత్యువాతకు గురయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మండల వ్యాప్తంగా బుధవారం ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం కురిసిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా ఉల్లింగల అప్పలరాజుకు చెందిన మూడు ఆవులు పిడుగుపాటుకు గురై మృతి చెందాయి. దీంతో రైతులు అప్పలరాజు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు. సుమారు రూ.లక్షా 40 వేల మేర నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం తనకు తగు న్యాయం చేయాలని రైతు అప్పలరాజు కోరుతున్నారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

నర్సీపట్నం: హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని టౌన్ సీఐ జి.గోవిందరావు తెలిపారు. నర్సీపట్నం మున్సిపాలిటీ, అయ్యరక కాలనీకి చెందిన కె.విజయ్‌కుమార్‌పై హత్య కేసు నమోదైందని, తొమ్మిది నెలల నుండి పరార్‌లో ఉన్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

సాయినగర్‌లో చోరీ

అనకాపల్లి: మండలంలో ఎన్జీవోఎస్ కాలనీ సాయినగర్‌లో ఏఎంఏఎల్ కళాశాల అధ్యాపకుడు నిరంజన్ కుమార్ ఇంట్లోలో గురువారం చోరీ జరిగింది. పట్టణ ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నిరంజన్ కుమార్ గురువారం ఉదయం కళాశాలకు వెళ్లి అదే రోజు రాత్రి 7.30 గంటలకు ఇంటికి తిరిగి వచ్చారు. లోపలికి వెళ్లి చూసేసరికి ల్యాప్‌టాప్, కారు తాళాలు, లగేజీ బ్యాగ్ చోరీకి గురైనట్లు గ్రహించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కొండకొప్పాకలో రెండు ఇళ్లలో చోరీ



విశ్రాంత హెచ్ఎం కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ అశోక్‌కుమార్

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామమైన కొండకొప్పాకలో రెండు ఇళ్లలో చోరీ జరిగినట్లు రూరల్ పోలీసులకు గురువారం ఫిర్యాదు అందింది. రూరల్ సీఐ అశోక్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొండకొప్పాక గ్రామంలో నివాసం ఉంటున్న విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి ఎం.సత్యనారాయణ బుధవారం గాజువాక మండలం కూర్మన్నపాలెంలో బంధువుల ఇంటికి వెళ్లి గురువారం వచ్చి చూసేసరికి ఇంట్లో తులంన్నర బంగారు ఆభరణాలు, రూ.5వేలు నగదు కనిపించలేదు. అదే గ్రామంలో విశ్రాంత హెచ్ఎం పీలా బాలగణపతి ఇంట్లో ఎవరూ లేని సమయంలో 2 కేజీల వెండి, లక్ష నగదు చోరీకి గురైంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డీఎస్సీలో గిరిజన అభ్యర్థులకు న్యాయం చేయాలి

ఎంవీపీకాలనీ: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఉపాధ్యాయ నియామకాల(డీఎస్సీ) ప్రకటన ద్వారా గిరిజన నిరుద్యోగులకు అన్యాయం జరుగుతోందని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం పేర్కొంది. ఈ మేరకు సంఘం నాయకులు గురువారం రంపచోడవరం ఐటీడీఏలో గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేశారు. గిరిజన యువతకు ప్రయోజనం చేకూర్చే జీవో నంబర్ 3ని పునరుద్ధరించకుండా, ప్రత్యామ్నాయ ఉత్తర్వులు కూడా జారీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిందని వారు తెలిపారు. దీనివల్ల అత్యంత వెనుకబడిన గిరిజన తెగల నిరుద్యోగులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ప్రభుత్వం చర్చించి కొత్త ఉత్తర్వులు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎస్సీలో గిరిజన అభ్యర్థులకు నూరు శాతం రిజర్వేషన్‌ను తిరిగి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సోనాయి అప్పలరాజు, కార్యదర్శి శోభన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు



తాటిచెట్లపాలెం: వేసవి రద్దీ దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం ప్రస్తుతం నడుస్తున్న పలు ప్రత్యేక రైళ్లకు అదనపు కోచ్‌లు జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

- విశాఖలో ఈ నెల 4, 11, 18, 25 తేదీల్లో బయల్దేరే విశాఖపట్నం–ఎస్ఎంవీ బెంగళూరు(08581) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు, తిరుగు ప్రయాణంలో బెంగళూరులో ఈ నెల 5, 12, 19, 26 తేదీల్లో బయల్దేరే ఎస్ఎంవీ బెంగళూరు–విశాఖపట్నం(08582) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు 1–థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను జతచేస్తున్నారు.
- విశాఖలో ఈ నెల 6, 13, 20, 27 తేదీల్లో బయల్దేరే విశాఖపట్నం–కర్నూలు సిటీ(08545) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు, తిరుగు ప్రయాణంలో కర్నూలు సిటీలో ఈ నెల 7, 14, 21, 28 తేదీల్లో బయల్దేరే కర్నూలు సిటీ–విశాఖపట్నం(08546) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు 1–థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను కలుపుతున్నారు.
- విశాఖలో ఈ నెల 2, 9, 16, 23, 30 తేదీల్లో బయల్దేరే విశాఖపట్నం–చర్లపల్లి(08579) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు, తిరుగు ప్రయాణంలో చర్లపల్లిలో ఈ నెల 3, 10, 17, 24, 31 తేదీల్లో బయల్దేరే చర్లపల్లి–విశాఖపట్నం(08580) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు 1–థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను జతచేస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో 11 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో గంజాయి అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రైల్వే పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో విశాఖ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్ఐ ఎస్‌కే అబ్దుల్ మారూఫ్, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ ఎస్ చిట్టిబాబు , వారి సిబ్బంది గురువారం విశాఖ రైల్వేస్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాలపై విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లాకు చెందిన ఆసిఫ్.. విశాఖ స్టేషన్ మీదుగా ముజఫర్‌నగర్‌కు అక్రమంగా గంజాయిని తరలిస్తుండగా

ఆర్పీఎఫ్ ఏఎస్ఐ చిట్టిబాబు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతన్ని జీఆర్పీ ఎస్ఐ అబ్దుల్ మారూఫ్‌కు అప్పగించారు. జీఆర్పీ ఎస్ఐ అతని వద్ద నుంచి రూ.55 వేలువగా 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎంసీవో గోల్డెన్ జూబ్లీ వేడుకలు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో భారతీయ ఆర్మీ, వారి కుటుంబ సభ్యులకు సేవలందించేందుకు ఏర్పడిన మూవ్‌మెంట్ కంట్రోల్ ఆఫీస్(ఎంసీవో)కు గురువారంతో 60 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఇండియన్ ఆర్మీ సిబ్బంది నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం లలిత్ బోరా, కమోడర్ ఎల్ఎం ఫెర్నాండెజ్ హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా భారతీయ భద్రతా దళాలకు తగు సూచనలిచ్చేందుకు 1965 మే 1న ఎంసీవో ఏర్పడిందన్నారు. రైల్వేలతో అనుసంధానమై డిఫెన్స్ కోటా రిజర్వేషన్ల విషయంలో అందిస్తున్న సేవల్ని వివరించారు. డైరెక్టర్ జనరల్ వర్మ, కమాండర్ అశోక్ గొట్టపు, లాజిస్టిక్ ఆఫీసర్ రణ్ విజయ్, ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), ఇ.శాంతారాం(ఇన్‌ఫ్రా), రైల్వే, ఆర్మీ అధికారులు పాల్గొన్నారు.

క్లూ లేకున్నా.. కేసు ఛేదించారు

- అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తి నుంచి గొలుసు చోరీ
- సాంకేతికత సహాయంతో నిందితుల గుర్తింపు
- రెండు తులాల గోల్డ్ చైన్ రికవరీ



సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ విష్ణుస్వరూప్

సబ్బవరం: అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తి నుంచి బంగారు గొలుసు చోరీ చేసిన వ్యక్తుల నుంచి చైన్ రికవరీ చేసి, కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ విష్ణు స్వరూప్ తెలిపారు. క్లూ లేకున్నా నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సిబ్బందిని అభినందించారు. సబ్బవరం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సింహాచలం, దివ్యతో కలసి గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు.

అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిలోని చిన్నయ్యపాలెం వద్ద చినముషిడివాడకు చెందిన శ్రీనాథ జగన్నాథం ఈ నెల 26న అపస్మారకస్థితిలో పడి ఉన్నారు. ఆయన మెడలోని సుమారు రెండు తులాల బంగారు గొలుసును ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు తీసుకుని వెళ్లిపోయారు. బాధితుడి ఫిర్యాదుతో అప్రమత్తమైన పోలీసులు ఆ సమయంలో సబ్బవరం నుంచి పెందుర్తి వైపు ద్విచక్రవాహనంపై వెళ్లి, షాపుల వద్ద ఆగిన వారి వివరాలను సాంకేతిక సహాయంతో గుర్తించి, నిందితులను పట్టుకున్నారు. వారిని పెందుర్తి ప్రాంతానికి చెందిన సయ్యద్ నిజాముద్దీన్(25), బానుగుల నవీన్(27), పెనుమళ్ల చంద్రశేఖరరావు(45)గా గుర్తించారు. వారు సుమారు రూ.2 లక్షలకు పైగా విలువ చేసే ఆ చైన్‌ను బయట మార్కెట్‌లో రూ.1.5 లక్షలకు అమ్మేశారు. దీంతో ఆ చైన్‌ను రికవర్ చేసి, కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఎటువంటి క్లూ లేకపోయినా, చాకచక్యంతో కేసును ఛేదించిన సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

సీతమ్మధార: వైద్య ఆరోగ్య శాఖలో, జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం నాల్గవ రోజు కూడా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. కొందరు మహిళా ఉద్యోగులు తమ చిన్న పిల్లలను ఒడిలో పట్టుకుని నిరసన తెలిపారు. ధర్నా శిబిరాన్ని సందర్శించిన సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి మాట్లాడుతూ, ఆరోగ్య శాఖలో కీలకమైన విధులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. వారి పోరాటానికి సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.ఎస్.ఎన్ ప్రజ్ఞ, కార్యదర్శి గంట సుధ మాట్లాడుతూ, ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరేళ్లు పూర్తి చేసుకున్న సీహెచ్‌ఓలను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని, ఈపీఎఫ్‌ను పునరుద్ధరించాలని, క్లినిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించి క్రమం తప్పకుండా ఇవ్వాలని కోరారు. నిర్దిష్టమైన జాబ్ చార్ట్ ఇవ్వాలని, ఎఫ్ఆర్ఎస్ నుండి సీహెచ్‌వోలకు మినహాయింపు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. హెచ్ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్, బదిలీలు, ఎక్స్ గ్రేషియా, పితృత్వ సెలవులు వంటివి అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు జి.సుధారాణి, పి.దివ్య, బి.శ్రావణి, టి.మోషే, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సాగునీటి చెరువు ఆక్రమిస్తే ఖబడ్దార్



చెరువు వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

కశింకోట: మండలంలోని గొబ్బూరు వద్ద గైరమ్మ సాగునీటి చెరువు ఆక్రమిస్తే ఖబడ్దార్ అంటూ తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు హెచ్చరించారు. ఇక్కడ చెరువు ఆక్రమణకు గురి కాకుండా గురువారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయించారు. ప్రభుత్వానికి చెందిన చెరువును ఆక్రమించిన వారు శిక్షార్హులని, ఉత్తర్వులు అతిక్రమిస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఈ చెరువు సర్వే నంబర్ 19లో 3.63 ఎకరాల విస్తీర్ణం ఉందని తెలిపారు. చెరువు ఆక్రమణపై కలెక్టర్ విజయ కృష్ణన్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో విచారణ జరిపి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసినందుకు తహసీల్దార్, రెవెన్యూ సిబ్బందికి రైతు బుద్ధ వెంకటరమణ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కశింకోట: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండబోదని ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. కశింకోట, బయ్యవరం, విసన్నపేట, రామన్నపాలెం, తేగాడ, వెదురుపర్తి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందన్నారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

పోయిన బ్యాగ్ దొరికింది

- ఆటో నుంచి జారిపడిన బ్యాగ్ పోలీసుకు దొరికిన వైనం
- బాధితురాలికి అందజేత



బాధితురాలికి బ్యాగ్ అందిస్తున్న ఎస్ఐ దేముడునాయుడు, చిత్రంలో హెచ్‌సీ కృష్ణ

పెందుర్తి: వెండి ఆభరణాలు, నగదుతో ఉన్న హ్యాండ్ బ్యాగ్‌ను ఓ మహిళ పోగొట్టుకుంది. అయితే సినీఫక్కీలో ఆ బ్యాగ్ పోలీస్‌కు దొరికింది. ఇటు బాధితురాలి ఫిర్యాదు..అటు పోలీస్ బాధ్యత వెరసి, వెంటనే బాధితురాలి చెంతకు బ్యాగ్ చేరింది..

వివరాలివి..ఎస్.కోటకు చెందిన రొట్ట వసంత ఆటోలో ఎస్.కోట నుంచి నగరానికి వస్తోంది. సరిపల్లి వద్దకు వచ్చేసరికి 21 తులాల వెండి, రూ.4.500 నగదు ఉన్న ఆమె హ్యాండ్ బ్యాగ్ జారిపడిపోయింది. పెందుర్తి కూడలి వద్దకు వచ్చిన తరువాత గుర్తించిన వసంత వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా, అదే సమయంలో సరిపల్లి వైపు విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కృష్ణకు రోడ్డు పక్కన బ్యాగ్ కనిపించింది. వెంటనే బ్యాగ్‌ను స్టేషన్‌కు తీసుకువచ్చిన హెచ్‌సీ కృష్ణ సీఐ కె.వి సతీష్‌కుమార్‌కు తెలిపారు. అదే సమయంలో బాధితురాలు వసంత అక్కడే ఉండడంతో వెంటనే ఎస్ఐ దేముడునాయుడు చేతుల మీదుగా ఆమెకు బ్యాగ్‌ను అందించారు.

హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహిద్దాం

మునగపాక: హనుమాన్ జయంతి వేడుకలను ఈ నెల 22న ఘనంగా నిర్వహించాలని సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర ప్రముఖ్ కొండారెడ్డి పిలుపునిచ్చారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని నాగులాపల్లిలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ గ్రామంలో భజనలు, పౌర్ణమి హారతులు, సంకీర్తనలు వంటి కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో దైవభక్తి పెంచాలన్నారు.

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 43 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-6, ఓ పాజిటివ్-30, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ లోకేష్‌ను (9703619706)సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 298 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 164 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

పండ్లతోనే ఆరోగ్య రక్షణ





- నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు మేలు
- వేసవిలో సీజనల్ ఫ్రూట్స్, జ్యూస్‌లతో ఉపశమనం
- అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తలు పాటించాలి
- శరీరం కొద్దిగా మగతగా కనిపించినట్లయితే వైద్యులను సంప్రదించాలి

అనకాపల్లి: ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుపోతున్నాయి. అగ్ని గుండంలా భానుడు భగభగమంటున్నాడు. గృహాల నుంచి బయటకు రావాలంటే ప్రజలు ఎండకు భయపడుతున్నారు. అత్యవసరమైన సమయంలో తప్ప మిగిలిన సమయాల్లో గృహాల్లో సీలింగ్‌ఫ్యాన్లు, ఏసీలకే పరిమితమవుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వారం నుంచి భానుడు తమ ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఈ నేపథ్యంలో వైద్యులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పలు సూచనలు చేస్తున్నారు. పట్టణ పరిధిలో ఇప్పటికే 39.5 డిగ్రీలకు మించి నమోదవుతుండడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. సాధారణంగా మే నెలలో సూర్యుడి ప్రతాపం ఎక్కువగా ఉంటుంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఎండలు మండుతుండడం, అనంతరం రాత్రంతా ఉక్కపోత అధికం కావడంతో దిక్కుతోచని స్థితిలో ప్రజలు విలవిల్లాడుతున్నారు. దీంతో వడదెబ్బ బారిన పడకుండా నీటి శాతం ఎక్కువగా ఉన్న ఫ్రూట్స్ తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

మజ్జిగ అధిక వేడిని తగ్గిస్తుంది...

వేసవి ఉష్ణాన్ని తగ్గించడంలో మజ్జిగ ఎంతగానో ఉపయోగపడుతుంది. మజ్జిగను పటిక బెల్లంతో తీసుకుంటే పైత్యం తగ్గుతుంది. శొంఠి, పిప్పళ్లు, మిరియాల చూర్ణంతో కలిపి తీసుకుంటే కఫం తగ్గుతుంది. రోజు మజ్జిగ ఎంత తాగితే అంత మంచిదని వైద్యులు చెబుతున్నారు.

కొబ్బరి నీటితో ఉపశమనం



కొబ్బరిబొండాలు ఏడాది మొత్తం ప్రజలకు అందుబాటులో ఉంటాయి. వేసవిలో శరీరానికి అలసట, నీరసం, అధిక ఉష్ణోగ్రతలను త్వరగా తగ్గించడంలో కొబ్బరి నీరు ఎంతో ఉపయోగకరం. శరీరానికి అవసరమైన పోషకాలతో పాటు తక్షణ శక్తిని సమకూర్చడంలో కొబ్బరినీరు ఎంతగానో ఉపయోగపడుతుంది. కొలెస్ట్రాల్‌ను తగ్గించే గుణం ఉంది.

కొబ్బరి నీటిలో క్యాలరీలు	47 శాతం
పొటాషియం	600 గ్రాములు
సోడియం	2.52 మిల్లీగ్రాములు
విటమిన్ సీ	5.8 మిల్లీ గ్రాములు

మానవ శరీరానికి మేలు చేసే ద్రాక్ష...

సులువుగా జీర్ణమయ్యే పండ్లలో ద్రాక్ష ప్రధానంగా చెప్పవచ్చు. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. జ్యూస్ రూపంలో తీసుకోవచ్చు. కిడ్నీలో రాళ్లను నిరోధిస్తుంది. అజీర్ణం, మలబద్ధకం, గొంతులో ఇన్‌ఫెక్షన్‌ను తగ్గిస్తుంది. శరీరంలో కొవ్వు పెరగకుండా నియంత్రిస్తుంది. క్యాన్సర్‌తో పోరాడుతుంది. శక్తిమంతమైన యాంటీ యాక్సిడెంట్లు అధికంగా ఉన్నాయి.

ద్రాక్షలో నీరు	92శాతం.
కార్బోహైడ్రేడ్స్	7శాతం
క్యాల్షియం	20 మిల్లీగ్రాములు
సీ విటమిన్	39 మిల్లీ గ్రాములు

వేసవిలో ఎక్కువగా వచ్చే పుచ్చకాయలు...



ఏటా ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో పుచ్చకాయలు ఎక్కువగా వస్తాయి. నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. బీ విటమిన్, పీచుపదార్థం, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్స్ పుష్కలంగా లభిస్తుంది. వడదెబ్బ నుంచి తక్షణమే ఉపశమనం కలిగించే శక్తి ఎక్కువగా ఉంటుంది.

నీరు	96శాతం
ప్రొటీన్	0.3గ్రాములు
కొవ్వు	0.2 గ్రాములు

క్యాల్షియం	32 మిల్లీ గ్రాములు
ఐరన్	1.3 గ్రాములు
శక్తి	17 కిలో క్యాలరీలు

నిమ్మ రసం...



శరీర వేడిని తగ్గించడంలో నిమ్మ ఎంతో ఉపయోగపడుతుంది. నిమ్మరసాన్ని ఉప్పు సోడాతో తీసుకోవడంతో దాహార్తిని నియంత్రిస్తుంది. శరీరానికి కావలసి సీ విటమిన్ నిమ్మరసంలో లభిస్తుంది. దీంతో రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. గోరువెచ్చని నీటితో కాస్త నిమ్మరసం, తేనె కలుపుకుని సేవిస్తే శరీర బరువు తగ్గుతుంది.

ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి



వేసవిలో ఆరోగ్య సంరక్షణకు పండ్లు, ద్రవ పదార్థాలు తీసుకోవాలి. వడదెబ్బ బారిన పడకుండా నీటిశాతం అధికంగా ఉండే సీజనల్ పండ్లు తీసుకోవడం మంచిది. మసాలా, మాంసాహారపు పదార్థాలకు దూరంగా ఉండాలి. మజ్జిగ, కొబ్బరి నీరు, పండ్ల జ్యూస్‌లు అధికంగా పగలు సమయంలో తీసుకోవాలి. ప్రధానంగా పిల్లలు, వృద్ధులు తేలికపాటి ఆహారాన్ని తీసుకోవడం మంచిది.

– డి.డి.నాయుడు, ప్రైవేట్ వైద్యుడు, అనకాపల్లి

వేసవిలో సీజనల్ పండ్లు మంచివే



వేసవి తాపానికి సీజనల్ పండ్లు ఎంతో ఉపయోగకరం. ప్యాకింగ్ చేసే పదార్థాలు, చిరుతిండ్లు, ఫాస్ట్‌ఫుడ్స్ ఆహార పదార్థాలకు ప్రజలు వేసవిలో దూరంగా ఉండాలి. అధిక ఉష్ణోగ్రతల కారణంలో శరీరంలో నీరు శాతం తగ్గిపోతుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు తీసుకోవడం మంచిది. బయట ఆహారానికి స్వస్తి పలకాలి. వడదెబ్బ బారిన పడిన వ్యక్తులకు ఓఆర్ఎస్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇబ్బందిగా ఉంటే దగ్గరలో ఉన్న వైద్యులను సంప్రదించాలి.

– వాణి జగదీశ్వరి, తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యురాలు

రెపరెపలాడిన ఎర్రజెండా

- పట్టణ, మండలంలో ఘనంగా మే డే వేడుకలు
- కార్మికుల చట్టాలను ప్రభుత్వాలే కాపాడాలి



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు



ముఠా కార్మికులకు మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ శేఖరం



నర్సింగరావుపేట ఏపీటీఎఫ్ భవనంలో మాట్లాడుతున్న కోన మోహన్‌రావు



సమావేశానికి హాజరైన కార్మికులు



సీపీఐ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బాలేపల్లి వెంకట్రావు



గాంధీనగరంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న రాజాన దొరబాబు

అనకాపల్లి: అరుణ పతాకాలు నింగికెగిసి రెపరెపలాడాయి. గురువారం మేడే వేడుకలను కార్మికులు ఘనంగా నిర్వహించారు. వివిధ సంఘాలు, యూనియన్ల నాయకులు ఎర్ర జెండాలను ఎగురవేశారు. హక్కుల కోసం పోరాడి అసువులు బాసిన వారికి నివాళులర్పించారు. పట్టణంలో సీఐటీయూ కార్యాలయం వద్ద పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.లోకనాథం పార్టీ జెండాను ఆవిష్కరించారు. బేవరేస్ ఎంప్లాయిస్ యూనియన్ వద్ద గంటా శ్రీరామ్, మున్సిపల్ కార్యాలయం వద్ద వై.ఏసురాజు, బాటా షాప్ వద్ద ముఠా కార్మిక సంఘం నాయకుడు భీశెట్టి అప్పారావు, ఆర్ఏఆర్ఎస్ కార్యాలయం వద్ద కె. నందేశ్వరరావు, జాతీయ రహదారి బైపాస్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఎస్ఐ డి.శేఖరం మేడే జెండా ఆవిష్కరించారు. ముఠా కార్మికులకు మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్లను ఎస్ఐ పంపిణీ చేశారు. నెహ్రూచౌక్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లోకనాథం మాట్లాడుతూ కార్మిక హక్కుల కోసం ఐక్యంగా పోరాటాల నిర్వహించాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, జీవీఎంసీ జోన్‌లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు టి.సురేష్, వారాది సత్యనారాయణ, మంద రాము, కాండ్రేగుల రాంబాబు, యర్రంశెట్టి శివకుమార్, సంతోష్, అజయ్, నూకరాజు, కె. అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మేడే వర్ధిల్లాలి...

స్థానిక నర్సింగరావుపేట ఏపీటీఎఫ్ భవనంలో ఏఐఎఫ్‌టీయూ (న్యూ), రైతు కూలీల సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి కోన మోహన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసే వరకూ పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా కష్టజీవుల, పీడిత ప్రజలు పోరాడి సాధించుకున్న హక్కుల పోరాట దీక్ష దినంగా ప్రపంచ వ్యప్తంగా నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. సీనియర్ న్యాయవాది పిళ్లా హర శ్రీనివాసరావు, జన సాహితి జిల్లా అధ్యక్షుడు ఐ.టి. ఆర్.వి. శివాజీరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్లు ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచడం అన్యాయమన్నారు. కార్మికులకు సరైన భద్రత ప్రమాణాలు లేకుండా తక్కువ వేతనాలతో కార్మికుల శ్రమను కార్పొరేటు, ప్రైవేటు కంపెనీలు దోచుకుంటున్నాయని, ఈ దోపిడీని ఆపాలని, పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలని, రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ ఎర్రజెండా స్ఫూర్తితో రైతులు, కార్మికులు ఐక్యంగా పోరాడాలన్నారు. అంతకుముందు మే డే సంక్షిప్త పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ (న్యూ) జిల్లా నాయకుడు అయితిరెడ్డి అప్పలనాయుడు, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కన్వీనర్ ఓ. లక్ష్మిమారి, ఎన్. వై.ఎస్ రాష్ట్ర నాయకుడు నందారపు భాస్కర రావు, క్వారీ కార్మిక సంఘ నాయకులు చింతల రమేష్, ముమ్మిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగరంలో.....

స్థానిక గాంధీనగరంలో అల్యూమినియం సంఘం తలుపులమ్మ ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ సంఘం ఆధ్వర్యంలో కార్మిక జెండను ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు ఆవిష్కరించి మాట్లాడారు. చికాగోలో లాంటి ఉద్యమాలు మళ్లీ జరిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. 11 ఏళ్లగా దేశాన్ని పాలిస్తున్న మోదీ నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అమలు పరిస్తుందని, దశాబ్దాల పాటు భారత కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చిందన్నారు. కార్మికులను యాజమాన్యాలకు వేతన బానిసలుగా చేయాలని ప్రయత్నిస్తుందే తప్ప కార్మికులకు కనీస వేతనం అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమైనట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 11 నెలలు గడుస్తున్నా సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో విఫలమైనట్లు పేర్కొన్నారు. అబద్ధాల కూటమి ప్రభుత్వం అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వియ్యపు రాజు, వియ్యపు హరీష్, పప్పల ఈశ్వర రావు, పెంటకోట సంతోష్, రాజు, సురేష్, నాయుడు, శంకర్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం కార్యాలయం వద్ద...

స్థానిక మెయిన్‌రోడ్డు సీపీఎం కార్యాలయం వద్ద ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ కార్మికులను ఏకం చేసే ప్రయత్నం ఇంగ్లాండులోనే ప్రారంభమైందన్నారు. ఇదే కాలంలో ఫ్రాన్సు, జర్మనీలలోని కార్మిక వర్గం సైతం జాగృతమై అనేక సమ్మె పోరాటాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు విత్తనాల పోతురాజు, డి లక్ష్మణరావు, అల్యూమినియం ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వీరాచారి, సీపీఐ జిల్లా నాయకులు శంకరరావు, రాజు విద్యార్థి నాయకులు బాబ్జి, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు

ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద...

స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మిక జెండాను యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: మండలంలో మే డే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కశింకోట సంతబయల సీఐటీయూ ఆధ్వర్యంలో అరుణ పతాకాన్ని ఎగుర వేసి వేడుకలు నిర్వహించారు. సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి. వరలక్ష్మి, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. తేగాడ, తాళ్లపాలెం, నరసింగబిల్లి, కన్నూరుపాలెం తదితర గ్రామాల్లో కార్మికులు అరుణ పతాకాలను ఎగుర వేసి ఆనందంగా వేడుకలు నిర్వహించారు.

పారిశుధ్యలోపం తలెత్తకుండా చర్యలు



రేగుపాలెంలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

యలమంచిలి రూరల్: మండలంలోని రేగుపాలెం గ్రామ పంచాయతీలో జిల్లా పంచాయతీ అధికారి ఆర్ శిరీషారాణి గురువారం పర్యటించారు. గ్రామంలో పారిశుధ్యలోపం తలెత్తకుండా చూడాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. గ్రామ పంచాయతీలో నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు గ్రామంలో సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. సర్పంచ్ రాజాన మహాలక్ష్మి, ఎంపీడీవో కొండలరావు, పంచాయతీ విస్తరణాధికారి దీపిక, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఆలయ వార్షికోత్సవాలు

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మలసాల భరత్‌కుమార్



కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి తల్లిదండ్రులను పరామర్శిస్తున్న భరత్‌కుమార్

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో ఆలయాల వార్షికోత్సవాలను నిర్వహించాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ తెలిపారు. గవరపాలెం పల్లపువీధిలో అభయాంజనేయస్వామి ఆలయ 11వ వార్షికోత్సవ కరపత్రాన్ని గురువారం ఆయన స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 5న నిర్వహించే ఈ వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, 80వ వార్డు ఇన్‌ఛార్జ్ కెఎం.నాయుడు, అంజనేయస్వామి ఆలయ అధ్యక్షుడు భీమరశెట్టి నూకేష్, ఉపాధ్యక్షుడు రాపేటి నూకేష్, కార్యదర్శి సూరిశెట్టి నరేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు బుద్ధ రాజు, దాడి నారాయణరావు తదితరులుపాల్గొన్నారు.

కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి తల్లిదండ్రులకు పరామర్శ....

స్థానిక అంజయ్యకాలనీలో 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి తల్లిదండ్రులు ఇల్లపు లోకేష్ లక్ష్మి దంపతులను నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పరామర్శించారు. ఇటీవల లో లోకేష్ దంపతులు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు మిరియాల కాలనీలో అనారోగ్యంలో బాధపడుతున్న పార్టీ నాయకుడు పిల్లా రాజును పరామర్శించారు. 83వ వార్డు ఇన్‌చార్జ్ జాజుల రమేష్, పార్టీ నాయకులు కోరుకొండ రాఘవ, గైపూర్ రాజు, వేగి త్రినాథ్, ఉగ్గినఅప్పారావు, ఆకుల సంతోష్ పాల్గొన్నారు.

పాన్‌షాపు అగ్నికి ఆహుతి



పరవాడ సంతబయలులో దగ్ధమైన పాన్ షాపు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, ఐద్వా ప్రతినిధి మాణిక్యం

పరవాడ: సంతబయలులో గురువారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో గ్రామానికి చెందిన తేలు అప్పలరాజు పాన్‌షాపు దగ్ధమైంది. ఈ అగ్ని ప్రమాదానికి గుర్తు తెలియని వ్యక్తులే కారణమని భావిస్తున్నారు. అప్పలరాజు బుధవారం రాత్రి షాపు మూసివేసి ఇంటికి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం షాపు తెరవడానికి వచ్చి చూడగా దుకాణం పూర్తిగా కాలిపోయి ఉంది. షాపులో ఉన్న డ్రింక్‌లు, సిగరెట్లు, పౌడర్లు, సబ్బులు తదితర సామగ్రి పూర్తిగా కాలిబూడిదయ్యాయని వాపోయాడు. అగ్నిప్రమాదంపై పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలాన్ని పరవాడ మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం పరిశీలించారు.

వరస అగ్నిప్రమాదాలు

సంతబయలులో ఇది తొమ్మిదో అగ్ని ప్రమాదమని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల గ్రామంలో చెప్పుల దుకాణం, అంతకు ముందు అయ్యప్ప పూజా సామగ్రి దుకాణం, ఎరువుల దుకాణం, పలు పాన్‌షాపుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించి దుకాణ యజమానులు తీవ్రంగా నష్టపోయారు. వరుస అగ్నిప్రమాదాలు ఎలా జరుగుతున్నాయన్నది ఎవరికీ అంతు చిక్కడం లేదు.

పూడిమడక రోడ్డు విస్తరణ ప్రక్రియ వేగవంతం

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణ ప్రక్రియ వేగవంతం చేయాలని అనకాపల్లి ఆర్డీవో అయిషా ఆదేశించారు. గురువారం ఆమె స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించి రోడ్డు విస్తరణకు సంబంధించి జరుగుతున్న పనుల వివరాలను తహసీల్దార్ ఆదిమహేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాగులాపల్లిలో చెట్ల తొలగింపు పనులను పరిశీలించారు. రహదారి విస్తరణలో భూములు, గృహాలు కోల్పోయే క్రమంలో నిర్వహించిన కొలతల ప్రక్రియలో తేడాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి బాధితునికి న్యాయం చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. డీటీ శేషుబాబు, వీఆర్వో నూకసూరి తదితరులు పాల్గొన్నారు.